ప్రత్యామ్నాయం భేష్

ఆశాజనకంగా మినుము పంట

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పడమర నడిమింపల్లిలో సాగుచేసిన మినుము పంట

నంబులపూలకుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పంటల సాగుతో నష్టపోయిన రైతులకు మినుముల సాగు ఊరటనిస్తోంది. మండలంలో 150 ఎకరాలకుపైగా నల్ల మినుముల పంట సాగు చేశారు. సాధారణంగా ఎక్కువ శాతం ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటలు సాగుచేస్తారు. ఈ ఏడాది జూలై చివరి వరకు వర్షాలు కురకపోవడంతో, పొలాలన్ని బీళ్లుగా మారాయి. ముంగారు వర్షానికి పొలాలను దుక్కి చేసుకుని, చదును చేసుకున్నప్పటికి విత్తన సాగుకు పదును కాలేదు. దీంతో వేరుశనగ సాగుకు సిద్ధం చేసుకున్న విత్తనాలను రైతులు మార్కెట్‌లో విక్రయించారు. అయితే వ్యవసాయాధికారుల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా మినుములను సాగుచేశారు. ఆగస్టులో కురిసిన వర్షానికి మినుము పంట సాగు చేశారు. 70 రోజుల్లోనే పంట కాలం పూర్తి కావడం, రబీకి మరో పంటను సాగు చేసుకునే అవకాశం ఉండటంతో రైతులు సాగుకు మొగ్గు చూపారు. ప్రభుత్వం కూడా ఉచితంగా మినుములు అందించింది. సాగు చేసిన రైతులకు పంట ఆశాజనకంగా ఉంది. విత్తినప్పటి నుంచి ఇప్పటివరకు వర్షాలు అడపాదడపా కురుస్తుండటంతో పైరు ఏపుగా పెరిగి ప్రస్తుతం పూత దశలో ఉంది. కొన్నిచోట్ల కలుపు దశలో ఉంది. దిగుబడి ఆశించిన మేర వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో...

వాణిజ్య పంటలైన దోస, కర్బూజ, దానిమ్మ, బత్తాయి, వేరుశనగ తదితర పంటల సాగుతో లక్షలాది రూపాయలు నష్టపోయిన రైతులకు మినుముల సాగు చక్కని ప్రత్యామ్నాయంగా మారింది. ఈ పంటకు పెట్టుబడి కూడా చాలా తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అన్ని ఖర్చులు కలుపుకుని ఎకరాకు రూ. పది నుంచి15వేలు మాత్రమే పెట్టుబడి వస్తుందని రైతులు పేర్కొన్నారు. అడపాదడపా వర్షాలు కురిసినా పంట బాగా వస్తుంది. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. క్వింటా దాదాపుగా రూ.ఎడెనిమిది వేలు ధర పలుకుతోంది. దీంతో చాలా మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పంట పరిశీలిస్తున్నాం

మినుము పైరు ఎదుగుదల బాగా ఉన్నప్పటికి రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఆకులు పసుపురంగులో కనిపిస్తే, వెంటనే వేప నూనె కషాయం పిచికారీ చేయాలి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు, లాభాలు వచ్చే అవకాశం ఉంది.

- లోకేశ్వర్‌రెడ్డి, ఏఓ, నంబులపూలకుంట

పది ఎకరాల్లో సాగుచేశాం



పొలాన్ని దుక్కిచేసి, సాగుకు సిద్ధం చేసుకున్నా. బోర్లలో ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడం, సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ పంటను పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోయా. ఆ సమయంలో వ్యవసాయాధికారులు మినుములు సాగుచేసుకోవాలని ఉచితంగా అందించారు. పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. పంట సాగుకు ఖర్చు చాల తక్కువ. ప్రతి రైతు తమకున్న భూముల్లో ప్రయత్నాయ పంటల వైపు దృష్టిసారిస్తే మంచి లాభాలు వస్తాయి. మా గ్రామంలో 40ఎకరాలకు పైగా భూమిలో రైతులు మినుములు సాగుచేశారు. **-చంద్రమోహన్‌రెడ్డి, పడమర నడింపల్లి**

చీడపీడలు లేవు



నేను రెండు ఎకరాల్లో మినుములు సాగు చేశా. సాగు చేసినప్పటి నుంచి అడపాదడప వర్షాలు కురవడంతో రోజుల వ్యవధిలోనే పంట ఎదుగుదల చాల ఆశజనంగా వచ్చింది. పంట సాగుకు ఖర్చు కూడా తక్కువే. ఇప్పటివరకు ఎలాంటి చీడపీడలు ఆశించలేదు. మంచి దిగుబడి వచ్చే అవకాశముంది. పూత సమయంలో వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి.

-కృష్ణారెడ్డి, బందారుచెట్లపల్లి

వచ్చేసింది.. సెలవుల పండుగ

- నేడు కాంప్లెక్స్ సమావేశం
- 22 నుంచి దసరా సెలవులు
- 3వ తేదీన స్కూల్స్ రీ ఓపెన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులపై కొన్ని రోజులుగా సాగుతున్న చర్చకు తెరపడింది. స్కూల్ క్యాలెండర్ ప్రకారం నవరాత్రుల ప్రారంభం నుంచే పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది 22 నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండగా.. రెండు రోజులు ఆలస్యంగా 24వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు ప్రకటించారు. దీనిని ఉపాధ్యాయ వర్గాలు తప్పుబట్టాయి. నవరాత్రుల ప్రారంభం రోజు నుంచి కాకుండా ఆలస్యంగా ఇవ్వడం ఏంటంటూ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం సెలవులు నవరాత్రులు ప్రారంభంనుంచే ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాలు ఇస్తున్నారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు దీనిని పెద్దగా

(మిగతా 6వ పేజీలో...)

చిత్రావతి చిందులు..!

- కర్ణాటకలో భారీ వర్షం
- పరవళ్లు తొక్కుతున్న నది
- పొంగిపొర్లుతున్న పరగోడు డ్యాం
- పుట్టపర్తిలో చెక్ డ్యాంపై నుంచి నీరు
- తనకల్లు మండలంలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వంకలు
- జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు

6



సుబ్బరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

హరిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హరిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒకరు కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం జిల్లాలోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, సీజనల్ వ్యాధులు, బయోమెట్రిక్ తదితర అంశాలపై జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృత్తంగా చేపట్టాలన్నారు. విరివిగా మొక్కలు నాటి, పచ్చదనం పెంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. రైతులకు యూరియా సకాలంలో పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీపీఓ సమత, జిల్లా సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రామునాయక్, డీఎఫ్ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


1,367 కొత్త ఈపోస్ యంత్రాలు

- త్వరలోనే డీలర్లకు పంపిణీ చేస్తాం
- జేసీ అభిషేక్ కుమార్



ఈపోస్ యంత్రాల గురించి చర్చిస్తున్న జేసీ

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1,367 రేషన్ షాపులకు కొత్త ఈపోస్ యంత్రాలు పంపిణీ చేయనున్నట్లు జేసీ అభిషేక్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నూతన ఈపోస్ యంత్రాల పనితీరు గురించి పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లతో జేసీ శుక్రవారం చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. నూతన యంత్రాలతో రేషన్ పంపిణీ వేగవంతం అవుతుందన్నారు. త్వరలో రెవెన్యూ డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి, డీలర్ల నుంచి పాత యంత్రాలు తీసుకుని, కొత్త వాటిని అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం


పరగోడు డ్యాం నిండి పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

చిత్రావతి చిందులు..!

కర్ణాటకలో భారీ వర్షం
పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

- పొంగిపొర్లుతున్న పరగోడు డ్యాం
- పుట్టపర్తిలో చెక్ డ్యాంపై నుంచి నీరు
- తనకల్లు మండలంలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వంకలు
- జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు

చిలమత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో చిత్రావతి నది పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి నదీ ప్రవాహం ఉధృతమైంది. దీంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. కర్ణాటకలోని నంది కొండల్లో నుంచి వచ్చే చిత్రావతి చిలమత్తూరు, గోరంట్ల మండలాల మీదుగా పుట్టపర్తికి చేరుకుంటుంది. నదిపై కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలోని పరగోడు వద్ద కట్టిన డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. ప్రవాహం గంటగంటకు పెరగడంతో పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చిలమత్తూరు మండలంలో కొడికొండ, మధురేపల్లి, సుబ్బరావుపేట, బూదిలి గ్రామాల వద్ద ఉన్న వంతెనలపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొంతకాలంలగా వర్షాభావంతో నిరాశ చెందిన రైతులు నాలుగురోజులుగా పడుతున్న వానలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న మరోనది కుషావతి కూడా పారుతోంది. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఈ నది ద్వారా చిలమత్తూరు, కోడూరు చెరువులకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. చిత్రావతి, కుషావతి నదులు ఉధృతంగా పారుతున్న నేపథ్యంలో రాత్రి సమయాల్లో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏ సమయంలోనైనా నీటి మట్టాలు పెరగవచ్చని చెబుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పొంగిపొర్లిన చెక్ డ్యాం

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుట్టపర్తిలోని చెక్‌డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. సత్యసాయి శత జయంతి వేడుకల వేల నదికి నీరు రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పుణ్యస్నానాలకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. భూగర్భ జలాలు పెరిగి, తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని స్థానికులు చెబుతున్నారు. చిత్రావతికి వరద పెరుగుతోందనీ, లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

భారీ వర్షం

తనకల్లు (ఆంధ్రజ్యోతి): మండలంలోనిమార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కురమాలపల్లి, పెద్దఎద్దులవారిపల్లి, బొంతపల్లి, ఎర్రగుంటపల్లి, చీకటిమానుపల్లి, తదితర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కుంటలు, చెరువులు, వంకలు, వాగులు, చెక్ డ్యామ్‌లు పూర్తిగా నిండి, పొంగిపొర్లాయి. పది రోజులుగా పెద్ద ఎద్దువారిపల్లి చెరువుకు హంద్రీనీవా నీటిని వదులుతుండగా.. వర్షపు నీరు తోడవడంతో పూర్తిగా నిండింది. పైనున్న చెరువులన్నీ నిండి పొంగి పొర్లడంతోపాటు వర్షం ఎక్కువగా కురవడంతో పెద్ద ఎద్దులవారిపల్లి చెరువు మరువ పారింది. కురమాలపల్లి వద్ద హంద్రీనీవా కాలువ నీటికి వర్షపునీరు తోడవడంతో ప్రవాహం పెరిగింది. దీంతో రోడ్లు కోతకు గురయ్యాయి. ఒక్కసారిగా నీరు అంతా రావడంతో చీకటిమానుపల్లి వద్ద శుక్రవారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు జాతీయ రహదారి నీటితో నిండిపోయింది. రాకపోకలు స్తంభించాయి. దీంతో ఈదులవంక నుంచి రెండు కిలోమీటర్లపైగా వాహనాలు ఆగిపోయాయి. వంకకు అటు వైపు అన్నమయ్య జిల్లాలోని మొలకల చెరువు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదుల వంక ఉధృతి తగ్గగానే యువకులు దగ్గరుండి వాహనాలను దాటింపజేశారు. ఒక్కరాత్రిలోనే చెరువులన్నీ నిండిపోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న ఈదులవంక



రోడ్డుకి ఇరువైపులా ఆగిన వాహనాలు


సుబ్బరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

జీఎస్టీ ఎఫెక్ట్ !

- ముందుకు సాగని చెరువుల మరమ్మతులు
- జిల్లాకు రూ.రెండు కోట్లు మంజూరు
- 168 చెరువులకు 30చెరువుల్లో పనులు ప్రారంభం
- జీఎస్టీ నిబంధనతో ముందుకురాని సాగునీటి సంఘం సభ్యులు


వెంగళమ్మచెరువులో మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

మడకశిర, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల మరమ్మతులపై జీఎస్టీ లైసెన్స్ ఎఫెక్టు తీవ్రంగా పడుతోంది. జీఎస్టీ లైసెన్స్ ఉన్న సాగునీటి సంఘం వారే మరమ్మతులు చేయాలని ప్రభుత్వ నిబంధనలతో ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 168 చెరువులకు మరమ్మతు పనులు చేయాలని ప్రభుత్వం భావించగా కేవలం 30 చెరువుల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 8 చెరువుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లాలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే జిల్లాకు తొలి విడతగా రూ. రెండు కోట్లు మంజూరు చేశారు. ఇందులో ఒక్కో చెరువుకు రూ.60 వేలు మొదలుకుని రూ.నాలుగు లక్షల దాకా నిధులు మంజూరు చేశారు. అయితే జీఎస్టీ నిబంధనతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడలేదు. పెనుకొండ డివిజన్ పరిధిలో 95 చెరువులకు గాను 25 చెరువులకు టెండర్లు పిలిచారు. 14 చోట్ల పనులు జరుగుతున్నాయి. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు రూ.99 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో 44 చెరువులకు టెండర్లు పిలిచారు. 17 చెరువులకు టెండర్లు పిలవాల్సి ఉంది. సాగునీటి సంఘం అధ్యక్షులు ఇప్పటికే 16 చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో 7 చెరువుల పనులు పూర్తి అయ్యాయి. ఆయకట్టు సంఘాలు లేని చోట టెండర్లు పిలిచి పనులు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన తల్లికి వందనం, రేషన్‌కార్డు వంటి పథకాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది ఆయకట్టు సంఘం సభ్యులు జీఎస్టీ లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు రావడం లేదని సమాచారం.

ఏడు చెరువులకు రూ.17లక్షలు



అమరాపురం మండలంలో ఏడు చెరువులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి. జీఎస్టీ లేకుండా పనులు చేపట్టేందుకు అనుమంతించాలని సంబ ంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాం. చెరువు కట్టల మీద కంపచెట్లు తొలగించడం, తూముల మరమ్మతులు చేయడం ఈ వర్షాకాలంలో కష్టమని, డిసెంబరు లేదా జనవరిలో పనులు చేపట్టడానికి అనుమతించాలని అధికారులను కోరాం.

- గురుసిద్ధప్ప, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు, అమరాపురం

జిల్లాకు రూ.రెండు కోట్లు: గురుమూర్తి, సురేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు

శ్రీసత్యసాయి జిల్లాలో చెరువుల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా లో 168 పనులకు 30 చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇందులో పెనుకొండ డివిజన్‌లో 95 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. 14 చోట్ల పనులు పనులు ప్రారంభించారు. ఇందులో 25 చెరువులకు టెండర్లు పిలిచాం. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 17 చెరువులకు టెండర్లు పిలిచాం. 16 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఏడు చోట్ల చెరువుల మరమ్మమతు పనులు పూర్తయ్యాయి.

చలో మెడికల్ కాలేజీకి స్పందన కరువు

- సెల్ఫీలతో సరిపెట్టిన వైసీపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'చలో మెడికల్ కాలేజీ' పేరిట వైసీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో 'సెల్ఫీ విత్ మెడికల్ కాలేజీ' అన్నట్లు తయారైంది. పిల్లర్ల నడుమ నిలబడి మెడికల్ కాలేజీ భవంతిని నిర్మించినట్లు నాయకకులు ఫొటోలు దిగారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు పెనుకొండ మెడికల్ కళాశాల భవనం నిర్మిస్తున్న ప్రాంతానికి వెళ్లారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉష శ్రీచరణ్, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తదితరులు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలపై కక్ష కట్టిందని ఆరోపించారు. పెనుకొండ వద్ద భవనాలు నిర్మించినా, ఏమీ లేవని మంత్రి సవిత చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైసీపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఉష శ్రీచరణ్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ కార్యకర్త 'నరుకుతాం' అంటూ కేకలు వేశాడు.


పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్


అనంతపురంలో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో 2.0 విధానంలో తలెత్తుతున్న సమస్యలపై డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ నిరసన నిర్వహించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌రిజిస్ట్రార్లు, ఇతర సిబ్బంది పెండింగ్ పనులు చేసుకున్నారు. స్టాంపులు, ఈసీలు, నకల్లు ఇతర వాటికి మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. అనంతపురంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో -1, రూరల్ కార్యాలయంలో-4తో కలిపి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 15వరకు, శ్రీ సత్యసాయి జిల్లాలో 10 మొత్తం 21 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 25 డాక్యుమెంట్లు జరిగాయి. డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ, విక్రయదారులు ఓటీపీ చెప్పాల్సి వస్తోందని, కానీ మొబైల్‌ఫోన్లు లేని వారికి ఇబ్బందిగా ఉందన్నారు. ఎనీవేర్ విధానంలో గంటలో డాక్యుమెంట్ సబ్‌మిట్ చేసుకుంటే ఇదివరకు గంట సమయంలో ఓకే లేదా రిజెక్ట్ చేసే విధంగా ఉండేదన్నారు. కానీ ఇప్పుడు 48గంటలకు గడువు పెంచారని, దీంతో అక్కడి వారికి తీవ్ర సమస్యగా ఉందన్నారు. పెన్‌డౌన్ శనివారం కూడా కొనసాగిస్తామన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్
2.362 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కమలపాడులో ఈ నెల 14న జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. నిందితులు ద్విచక్ర వాహనాల్లో స్టీలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మే వారిలా గ్రామంలో రెక్కీ నిర్వహించారు. తాళాలు వేసిన రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వాటిలో చొరబడి వెండి వస్తువులు, డబ్బులు ఎత్తుకెళ్లారన్నారు. ఈ కేసులో నిందితుల నుంచి 2362గ్రాముల వెండి ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం భూతంవారి గ్రామానికి చెందిన అంజయ్య, ఏసురత్నం, కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగుకు చెందిన హనుమంతును కొనకొండ్ల సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

వచ్చేసింది.. సెలవుల పండుగ

(5వ పేజీ తరువాయి)



పట్టించుకోలేదు. చివరకు టీడీపీ ఎమ్మెల్సీలు.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి సెలవులు వ్యవహారం తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈనెల 22వ తేదీ నుంచే దసరా సెలవులు ఉంటాయని ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. ఆ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని వెల్లడించారు. శనివారం కాంప్లెక్స్ సమావేశాలు యథాతథంగా కొనసాగించాలనీ, ఉదయం స్కూల్‌కు వెళ్లి మధ్యాహ్నం కాంప్లెక్స్ సమావేశాలకు ప్రతి టీచర్ హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు. ఆదివారం ఎలాగూ సెలవు ఉంటుంది. సోమవారం నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. అక్టోబరు 3వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారవర్గాలు తెలిపాయి. మొత్తంమీద దసరా సెలవులపై మంత్రి లోకేశ్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపడంపట్ల ఉపాధ్యాయ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

దానిమ్మ ధర నేలచూపులు

- టన్ను రూ.60వేలలోపే..
- ఈ రేటుతో పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు
- ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు బాగా రావడమే కారణం


ఏపుగా కాసిన దానిమ్మకాయలు

పుట్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దానిమ్మ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నానాటికీ తగ్గుతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నెలరోజుల క్రితం ఉన్న ధరలు అమాంతం తగ్గి సగానికి పడిపోతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం పెట్టుబడులైనా వస్తావా.. రావా.. అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే దానిమ్మ ధరలు సగం పైగానే తగ్గిపోయాయి. పుట్లూరు, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి, తాడిపత్రి, నార్పల తదితర మండలాల్లో దానిమ్మ ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 13,381 ఎకరాల్లో పంట పెట్టారు. గతంలో ధరలు ఎక్కువగా ఉండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది ధరలు తగ్గుముఖం పట్టడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టన్ను 60వేలలోపే..

ఎకరాలో దానిమ్మ సాగుకు రూ.80 వేల నుంచి లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. టన్ను ధర ప్రస్తుతం 60వేలలోపే పలుకుతోంది. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం దానిమ్మ టన్ను ధర రూ.1.20 లక్షలు పలికి రైతులకు సిరులు కురిపించింది. ఈసారి కూడా ధరలు బాగుంటాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. ఇతర రాష్ట్రాల్లో పంట దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఏపీలో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు నుంచైనా ధరలు పెరుగక పోతాయా అన్న ఆశతో రైతులు ఉన్నారు. అప్పుడు కూడా ధరలు పెరగకపోతే నష్టాలు తప్పవని వాపోతున్నారు. పంటను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పంట ఎక్కువగా వస్తుండడంతో తెలంగాణ, చెన్నైకి నామమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు.


వాహనంలో తరలించడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం


పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు



దానిమ్మ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడులు కూడా రావు. ఎకరాకి పెట్టుబడి రూ.80వేల నుంచి లక్ష వరకు వచ్చింది. దిగుబడి బాగున్నా.. ధరలు తగ్గడం కలవరపెడుతోంది. నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రానున్న నెలల్లో అయినా ధరలు పెరిగితే కొంత ఉపశమనం దక్కుతుంది.

- వెంకటనారాయణ, వరదాయపల్లి

ఈ ధరలతో నష్టమే..



దానిమ్మ ధరలు తగ్గడంతో పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం. కొన్నిచోట్ల పంట కోత దశకు రావడంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. ఏడెకరాల్లో పంట సాగుచేశా. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే దానిమ్మ కాయలు దెబ్బతిని మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు.

- శివశంకర్ రెడ్డి, కందికాపుల

వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు


చంద్రాయుడు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో వాతావరణ పరిస్థితుల కారణంగా పలు పంటల్లో సస్యరక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు శుక్రవారం ప్రకటనలో సూచించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వరుస వర్షాలతో భూమిలో తేమ ఎక్కువై, పలు రకాల పంటలను తెగుళ్లు ఆశించాయన్నారు. వెంటనే సస్యరక్షణ చేపట్టాలనీ, ఆలస్యంచేస్తే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన తెలిపిన సూచనలు.

పంటలు, తెగుళ్లు, నివారణ వివరాలు..

- 90 రోజుల వయసున్న వేరుశనగ పంటలో ఆకుమాడు, వేరుకుళ్లు, బూడిద రోగం 20 నుంచి 40 శాతందాకా ఉంది. వీటి నివారణ కోసం ఎకరాకు 250 గ్రాముల సాఫ్‌ను వేర్ల వద్ద తడిసేలా పిచికారీ చేసుకోవాలి.
- ఆముదం పంట పూత, గెల ప్రారంభ దశలో ఉంది. వేరుకుళ్లు, నామాల పురుగు, కాయకుళ్లు 15 నుంచి 30 శాతం వరకు ఆశించాయి. ఎకరాకు 250 గ్రాముల సాఫ్, 80 గ్రాముల ప్రొక్లేమ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- కంది పంట శాకీయ, పూత దశలో ఉంది. ఎండు తెగులు, వెర్రి తెగులు, లద్దె పురుగులు ఆశించాయి. నివారణ కోసం 250 గ్రాముల సాఫ్, 80 మి.లీ. కొరాజన్‌ను పిచికారీ చేసుకోవాలి.
- మొక్కజొన్నను కత్తెర పురుగు, ఆకుమాడు తెగులు ఆశించాయి. వీటి నివారణ కోసం ఎకరాకు 80 మి.లీ కొరాజన్, 250 గ్రాముల సాఫ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- చిరుధాన్య పంటల్లో లద్దె పురుగు, తెగుళ్ల నివారణ కోసం ఎకరాకు 80 గ్రాముల ప్రొక్లేమ్, 250 గ్రాముల సాఫ్‌ను స్ప్రే చేసుకోవాలి.
- కంది, ఆముదం, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలపై ఎకరాకు మల్టీ కే 10కిలోలను పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

23న మడకశిరలో మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, నాయకులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మడకశిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన మెగా జాబ్‌మేళా పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, తేజ్ కుమార్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొట్టిన లారీ.. ఇద్దరు యువకుల మృతి


ప్రమాదానికి కారణమైన లారీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం పాములరాయి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనంతపురం నగరంలోని వినాయకనగర్‌కు చెందిన ముత్తుం బాషా(23), కుమార్ కార్తీక్ (20) అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరూ టైల్స్ వర్క్ చేస్తూ జీవనం సాగించేవారు. పాములరాయి సమీపంలో ఓ వెంచర్‌లో పని ముగించుకుని, బైక్‌పై అనంతపురానికి తిరిగి వస్తుండగా కర్నూలు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. లారీ అధిక వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీ ఢీకొట్టింది. బైక్ హ్యాండిల్ లారీకి ఇరుక్కోవడంతో ఇద్దరు యువకులు అదుపు తప్పి లారీ చక్రాల కింద పడ్డారు. దీంతో శరీర అవయవాలు నుజ్జునుజ్జయ్యాయి. ముత్తుం బాషాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్ కార్తీక్ అవివాహితుడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

యాడికి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ సయ్యద్‌వలి (35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్‌వలి నైటీల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. వ్యాపార పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో ముందువైపు వెళుతున్న లారీని ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్లి ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని తాడిపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రబియా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రిన్సిపాల్‌పై విద్యార్థి దాడి


విచారణ చేస్తున్న డీఎస్పీ రవిబాబు, డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు

శెట్టూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ప్రిన్సిపాల్ శ్రీరాములుపై శుక్రవారం దాడి చేశాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన మేరకు.. బెల్టు, షూ వేసుకురాని పదో తరగతి విద్యార్థిని ప్రార్థనా సమయంలో ప్రిన్సిపాల్ మందలించాడు. దీన్ని అవమానంగా భావించిన విద్యార్థి అందరి సమక్షంలోనే ప్రిన్సిపాల్ చొక్కా పట్టుకుని దాడికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయులు కలుగజేసుకుని దాడి నుంచి ప్రిన్సిపాల్‌ను కాపాడారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సమావేశపరిచి దాడి గల కారణాలను ఆరతీశారు. ఉన్నతాధికారులతో చర్చించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


రిలే దీక్షలు చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ.. నాలుగైదేళ్లుగా విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారన్నారు. ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారన్నారు. వెంటనే ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 262టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పశువులకు ఉచిత చికిత్స శిబిరం

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వెంకటేష్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూడేరు మండలం కమ్మూరులో శనివారం ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న ఆత్మకూరు మండలం సిద్దరాంపురం, 27న బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, 30న గుత్తి మండలం తొండపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- రూ. 35 లక్షల నగలు, బైకులు స్వాధీనం
- జల్సాల కోసం చైన్‌స్నాచింగ్‌లు, నోట్ల ముద్రణ
- చెడు సావాసంతో కటకటాల్లోకి కాబోయే డాక్టర్!

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యసనాలు ఆ ఇద్దరిని నేరస్థులుగా మార్చాయి. పాతికేళ్లు నిండకుండానే చైన్‌స్నాచింగ్, నకిలీ కరెన్సీ వంటి నేరాలు చేయడంలో ఆరితేరారు. ఇందులో ఒకరు రష్యా వెళ్లి ఎంబీబీఎస్ చేయాల్సి ఉండగా చెడు సావాసంతో కటకటాల పాలయ్యాడు. చైన్ స్నాచింగ్, నకిలీ నోట్ల తయారీకి పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచీ రూ.35 లక్షల బంగారం ఆభరణాలు, నగదు, నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జగదీష్ శుక్రవారం విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. కంబదూరులోని పాత ఎస్సీ కాలనీకి చెందిన 25 ఏళ్ల జశ్వంత్ అలియాస్ జశ్వంత్ రాజు, కంబదూరులోని ఆర్డీటీ కాలనీకి చెందిన 21 ఏళ్ల కంబదూరు భోగం రాజు అలియాస్ షాలేము రాజు బంధువులు, స్నేహితులు. జశ్వంత్ పెద్దగా చదువుకోలేదు. కర్ణాటక తదితర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవాడు. ఆయనపై కర్ణాటకలో ఆరు కేసులు ఉన్నాయి. నాలుగేళ్లుగా కర్ణాటకలోని పావగడ, కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాల్లో వాహనాల చోరీ, ఇళ్లలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. 2021లో పావగడలో 2 కేసులు, వైఎన్ హొసకోటలో ఒకటి, 2023లో కళ్యాణదుర్గంలో ఒకటి, 2004లో కంబదూరు స్టేషన్ రెండు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తన ఫ్రెండ్ భోగం రాజును సైతం అటువైపు మళ్లించాడు. అతడితో కలిసి నేరాలకు పాల్పడ్డాడు.

ఎంబీబీఎస్ కోసం రష్యా వెళ్లాలని...

భోగం రాజు వచ్చే నెలలో ఎంబీబీఎస్ చదవడం కోసం రష్యా వెళ్లాల్సి ఉంది. జశ్వంత్‌తో ఉన్న స్నేహం వల్ల అతడు జల్సాలకు పెట్టే ఖర్చులు చూసి భోగం రాజు కూడా అతడి మాయలో పడ్డాడు. సులభంగా వచ్చే డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇద్దరూ రెండేళ్లుగా నేరాల్లో పాల్గొంటూ వచ్చారు. ద్విచక్రవాహనాన్ని ఒకరు వేగంగా నడిపితే, మరొకరు మహిళల మెడలో బంగారు చైన్లు లాగేసేవాడు. అనంతపురం, పుట్లూరు,



స్వాధీనం చేసుకున్న నగదు, నగలను చూపుతున్న ఎస్పీ జగదీష్

నార్పల, ఉరవకొండ, తాడిపత్రి, కడప జిల్లా సింహాద్రిపురం మండలం తదితర ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే మహిళను టార్గెట్ చేసుకుని చైన్లు లాక్కెళ్లేవారు. దొంగిలించిన బంగారు నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకునేవాళ్లు. ఇద్దరిపై రెండేళ్లలో 12 కేసులు నమోదయ్యాయి. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, నార్పలలో-2, ఉరవకొండలో-1, తాడిపత్రిలో-3, తాడిపత్రి రూరల్-1, అనంతపురం రూరల్-1, పుట్లూరులో 2, కడప జిల్లా సింహాద్రిపురంలో ఒక కేసు నమోదైంది. నకిలీ కరెన్సీ కూడా ముద్రించి సుమారు రూ. 2 లక్షల వరకూ చలామణి చేసినట్లు సమాచారం. చైన్ స్నాచర్లపై నిఘా పెట్టిన పుట్లూరు, అనంతపురం సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే పుట్లూరు మండలం శనగలగూడురు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 35 లక్షల విలువైన 34 తులాల బంగారం ఆభరణాలు, రూ.35500నగదు, రూ. 500 నకిలీ నోట్లు, ప్రింటర్, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదింపులో కీలకంగా వ్యవహించిన సీఐలు సత్యబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శేషగిరి, జయపాల్‌రెడ్డి, వలిబాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ జగదీష్ ప్రశంసాపత్రాలు, రివార్డులతో అభినందించారు.

దేశ పురోగతిలో సొసైటీల పాత్ర కీలకం

● డీసీఓ అరుణకుమారి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి, చిత్రంలో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతి, సమాజాభివృద్ధి, దేశ పురోగతిలో సొసైటీల పాత్ర కీలకమని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో ఈ-ప్యాక్స్ (పీఏసీఎస్)పై ఒక్కరోజు వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ అరుణకుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (పీఏసీఎస్)ను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, చిరువ్యాపారులు పరస్పర సహకారంతో సొసైటీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశు లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొసైటీలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సొసైటీలు అభివృద్ధి సాధిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణస్వామి, పూర్వపు డీసీఓలు ప్రభాకర్‌రెడ్డి, పుల్లప్పలు సహకార చట్టం, సొసైటీల నిబంధనలు, ఆన్‌లైన్ నిర్వహణ, ఆన్‌లైన్ ఆడిట్‌పై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధికారులు రాజారెడ్డి, మురళీమోహన్, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్‌భాస్కర్, నూతనంగా నియమితులైన సొసైటీల చైర్మన్లు, సీఈఓలు, పర్సన్ ఇంచార్జిలు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక


హాజరైన క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన సెలెక్షన్స్ శుక్రవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించారు. డీఎస్‌డీఓ మంజుల.. పోటీలను ప్రారంభించారు. బాల, బాలికల అండర్-14, 16, 18, 20 విభాగాల్లో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ సుదర్శన్ ప్రకటించారు. లావణ్య, మహేంద్ర, సాంబశివారెడ్డి, జనశ్రీ, అమూల్య, చంద్రశేఖర్, అంజునాయక్, పవన్‌కుమార్, అరవింద్, శకుంతల, హేమంత్‌రాజ్, మంజునాథ్ యాదవ్, నవిత్ర, మహిత జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 27వ తేదీ నుంచి ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో మే నెలలో నిర్వహించిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం వర్సిటీలో వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల విభాగ డైరెక్టర్ రమణ, కంట్రోలర్ శ్రీరామ్‌నాయక్ ఫలితాలు విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 7,760 మంది పరీక్షలు రాయగా.. 3,535 మంది ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్‌లో 7,798 మంది పరీక్షలకు హాజరుకాగా.. 4,250 ఉత్తీర్ణులయ్యారు. శనివారం నుంచి ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులు చూసుకోవచ్చని పరీక్షల విభాగ అధికారులుతెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

త్వరలో మరో ఆరు సొసైటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జిల్లాలో ఆరు ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్) ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 58 సొసైటీలు ఉన్న విషయం తెలిసిందే. కొత్తగా ఏడీసీసీ బ్యాంకు రాయదుర్గం బ్రాంచ్ పరిధిలో ఓబుళాపురం, సోమలాపురం, గుమ్మఘట్టలలో సొసైటీలు ఏర్పాటు చేయనున్నారు. తాడిపత్రి బ్రాంచ్ పరిధిలో నందలపాడు, గుత్తి బ్రాంచ్ పరిధిలో బసినేపల్లి, రజాపురంలలో సొసైటీలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు డీసీఓ అరుణకుమారి తెలిపారు.

నేడు అక్కినేని స్వరాభిషేకం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని నగరంలో శనివారం సాయంత్రం అక్కినేని స్వరాభిషేకం నిర్వహిస్తున్నారు. అనంతనాగ్ సంగీత స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని కృష్ణకళా మందిర్‌లో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. అభిమానులు, కళాకారులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

టమోటా కిలో రూ.24

అనంతపురంరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

టీబీ విభాగాధికారిగా జయలక్ష్మి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని లెప్రసి, ఎయిడ్స్, టీబీ విభాగాల అధికారిగా డాక్టర్ జయలక్ష్మి నియమితులయ్యారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవిని శుక్రవారం ఆమె కలిసి విధుల్లో చేరారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

● జేడీ బసవరాజు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న సంపన్న కుటుంబాలు పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని రాష్ట్ర అర్థ గణాంకశాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) బసవరాజు అన్నారు. జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఇదివరకే ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పీ-4 కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటు చేశారు. జేడీ బసవరాజు మాట్లాడుతూ.. పీ 4 సర్వే ద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి, వారి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వార్డు, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. శిక్షణ పొందిన వారందరూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యప్రణాళిక శాఖ ఎస్ఓ గిరిధర్, తాతిరెడ్డి, నాయక్ పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కదిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీలో ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పట్టణంలోని కాలనీలో ఓ పాఠశాలలో బాలిక మూడో తరగతి చదువుతోంది. పాఠశాల పక్కన అంగడికి శుక్రవారం వెళ్లింది. అంగడి పక్కన ఉన్న రోషన్‌వలి అనే వ్యక్తి తన ఇంట్లోకి బాలికను పిలిచి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రోషన్ వలిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మా ప్రాంతం.. పరిశ్రమలకు అనుకూలం

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు శ్రీసత్యసాయి జిల్లా అనుకూలమైన ప్రాంతమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. సభలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి పుష్కలంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని కప్పలబండ ఇండస్ట్రియల్ పార్కులో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు? ఎంతమందికి అనుమతులు ఇచ్చారు? ఎంత భూమి మిగిలి ఉందో సంబంధితశాఖామంత్రి తెలపాలని ఎమ్మెల్యే కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు మహిళలకు ఎలాంటి రాయితీలు కల్పించే అవకాశం ఉందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. 2008-2009లో అమడగూరు ప్రాంతంలో రూ.లక్ష కోట్లతో 60 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేవిధంగా సైన్సుసిటీ ఏర్పాటు చేస్తామని 402 ఎకరాలు భూమిని అప్పటి ప్రభుత్వం సేకరించిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఈప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, పరిశ్రమలశాఖామంత్రిని ఎమ్మెల్యే కోరారు. జిల్లా బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో పాటు భూముల లభ్యత, ధర చౌకగా ఉన్నట్లు వివరించారు. ఇన్ని అనుకూలతలు ఉన్న శ్రీసత్యసాయి జిల్లాలో పరిశ్రమలు ఏమైనా స్థాపించే అవకాశాలుఉన్నాయా అని సంబంధిత మంత్రిని ప్రశ్నించారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలి: ఎస్ఈ


సమీక్షలో పాల్గొన్న ఎస్ఈ సంపత్‌కుమార్

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో పుట్టపర్తి డివిజన్‌లోని డీఈ, ఏఈలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల విషయంలో పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ బిల్లుల వసూలులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఐ గంగాధర్, ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈ శివరాం, సీకేపల్లి డీఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) నిర్వహించే స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సులో చేరడానికి ఆసక్తికలవారు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సు కోచింగ్ స్పోర్ట్స్ డిప్లొమా కోర్సుతో సమానమన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-315632, సెల్ నంబరు 7207384486లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు చేయడానికి వెబ్‌సైట్ http://www.nsis.in

జోరుగా పైరవీలు..!

- ముగిసిన వయోజన విద్య సూపర్‌వైజర్ ఇంటర్వ్యూలు
- పోస్టులు దక్కించుకునేందుకు అడ్డదారులు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్

అనంతపురంవిద్య, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖ పరిధిలో సూపర్‌వైజర్ పోస్టులు దక్కించుకునేందుకు అభ్యర్థులు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లా పరిధిలోని కదిరి, పెనుకొండ డివిజన్ల సూపర్‌వైజర్ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులకు ప్రభుత్వ టీచర్లుగా ఎస్‌జీ కేడర్‌లో దాదాపు పదేళ్ల సర్వీస్ ఉండి, 45 ఏళ్ల వయసులోపు వారు అర్హులు. ఈ పోస్టులకు 21మంది టీచర్లు దరఖాస్తులు చేసుకున్నారు. పోస్టును ఎలాగైనా దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. కొందరు.. రాజకీయ నేతలనుంచి సిఫార్సులు చేయించగా.. మరికొందరు డబ్బు ఎరగా వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఇద్దరు టీచర్లు తమకు ఆ పోస్టులు ఇప్పిస్తే రూ.5 లక్షలు ఇస్తామని ఆ శాఖలో పనిచేస్తున్న ఒకరితో ఒప్పందం చేసుకుని, అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు కూడా ఇచ్చారంట. అందులో ఓ టీచర్ అభ్యర్థిత్వం నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించారని తెలుస్తోంది. దీంతో ఆ డబ్బు వాపసు ఇచ్చారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. 21 మందిలో 8 దరఖాస్తులను తిరస్కరించగా.. 13 మందిని ఇంటర్వ్యూలకు అధికారులు ఆహ్వానించారు. వీరికి జిల్లా వయోజన విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ ఆధ్వర్యంలో వయోజన విద్యాశాఖ డీడీ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ గుత్తి డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి తదితరులు ఈనెల 18న ఇంటర్వ్యూలు నిర్వహించారు. 12మంది టీచర్లు హాజరుకాగా.. ఒకరు గైర్హాజరయ్యారని డీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్వ్యూలు ముగియడంతో పోస్టులు దక్కించుకునేందుకు పైరవీలు ముమ్మరం చేశారు. అనంతపురం జిల్లాలో ఒకరు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఈ శాఖలో పనిచేస్తున్న మరొకరు ఈ పైరవీకారులతో ఒప్పందం చేసుకుని, వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీలో పారదర్శకత పాటిస్తారా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్ బాక్స్

విద్యార్థి మృతిపై డీఎంహెచ్ఓ ఆరా


విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

ముదిగుబ్బ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే గేట్ కొట్టాలలో గురువారం విష జ్వరంతో మృతి చెందిన 8వ తరగతి విద్యార్థి మహమ్మద్ షాహిద్ కుటుంబాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజ్ బేగం శుక్రవారం పరామర్శించారు. విద్యార్థి మృతికి గల కారణాలను ఆమె తల్లి దండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులను, పరిసరాలను పరిశీలించారు. బాలుర పాఠశాలలో కుట్టు శిక్షణా కేంద్రంలో ఉన్న మహిళలకు డ్రై డే-ఫ్రైడే, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంఓ ఓబులు, మండల వైద్యాధికారిణి శ్వేత, మలేరియా యూనిట్ అధికారి దేవలానాయక్, సూపర్‌వైజర్ శశిధర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం: పీడీ


మెనూ వివరాలు తెలుసుకుంటున్న ఐసీడీఎస్ పీడీ ప్రమీల

కొత్తచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల తెలిపారు. కొత్తచెరువు వేణుగోపాల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ జయంతితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. ఆన్‌లైన్‌లో పిల్లల వివరాలు, బరువు, ఎత్తు, ఏవిధంగా పొందు పరిచారో అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి కూరలో గొంగూర, బ్యాళ్లు ఎంతమోతాదు వేశారు అని అడిగారు. తెలియదని ఆయాలు చెప్పడంతో మీకే తెలియకపోతే ఇక వంటలు ఎలా వండుతారని మందలించారు.

'మంత్రి సవితపై అనుచిత వ్యాఖ్యలు తగదు'

బుక్కపట్నం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని జిల్లా కురబ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడిగా చెప్పుకునే జబ్బల శ్రీనివాస్ మంత్రిపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. కురబ సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం సొంత నిధులు ఖర్చుచేస్తున్న మంత్రిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, మంజునాథ్, నాగరాజు, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అమడగూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని వైద్యసిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని తనకంటివారిపల్లిలో శుక్రవారం ఇంటింటా తిరిగి జ్వరపీడితులను గుర్తించారు. గ్రామంలో అపరిశుభ్రదతపై వివరించి, అనారోగ్యాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. జ్వరంతో బాధపడుతున్నవారు కాచిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చాంద్‌అలీఖాన్, ఏఎన్‌ఎం శ్యామ్‌సూన్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యులు కమల్‌రోహిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. హాజరైన మహిళలకు జనసేన మండల ప్రధాన కార్యదర్శి కొండబోయన సతీష్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్, జంగాల శీనా, బాలక్రిష్టారెడ్డి, షానవాజ్, నాగరాజు, శివ, సాయి, వెంకీ పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా ఉంచాలి: సీఐ

ముదిగుబ్బ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలపై మహిళా పోలీసులు నిఘా ఉంచాలని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ శివరాముడు తెలిపారు. శుక్రవారం ముదిగుబ్బలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ...గ్రామ స్థాయిలో జరిగే గొడవలు, మహిళలు, పిల్లలకు సంబంధించిన నేరాలు, ప్రస్తుత సమస్యలపై ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ ఎస్ఐ ప్రసన్న పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: గ్రామాల్లో బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ పోలీసులకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘి క కర్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

'శ్రీనివాసులు సేవలు మరువలేనివి'

బత్తలపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.ఈ మేరకు శుక్రవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పరిపాలన అధికారిగా శ్రీనివాసులు కార్యాలయానికి వచ్చే ప్రజలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, క్రిష్టప్ప, ఎంపీపీ త్రివేణి, జడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

నల్లమాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసకవంకపల్లిలో వ్యవసాయ బోర్ల వద్ద గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రైతులు తమకం రామమోహన్, తమకం శ్రీనివాసులు మాట్లాడుతూ.. తమ వ్యవసాయబోర్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 25 కేవీ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పగలకొట్టి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను చోరీ చేసినట్లు వివరించారు. సుమారు రూ.రెండు లక్షలు నష్టం జరిగిందన్నారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న రైతులు

అసౌకర్యాల వసతి గృహం

● ఇబ్బందుల్లో బీసీ హాస్టల్ విద్యార్థులు
● పట్టించుకోని అధికారులు

గాండ్లపెంట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కనీస సౌకర్యాలు లేకపోవడంతో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ సమస్యల నిలయంగా మారింది. హాస్టల్‌కు ముందు, వెనుక వైపు ఉన్న ప్రధాన ద్వారాలు మూసివేశారు. దీంతో దాదాపు కిలోమీటర్ దూరం నుంచి చుట్టు వేసుకుని ఉన్నతపాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తోంది. అసలే పుస్తకాల మోతతో సతమవుతున్న విద్యార్థులు పాఠశాల దూరంగా ఉండడంతో హాస్టల్‌లో ఉండడానికి మొగ్గు చూపడం లేదు. గతంలో 150 మందికిపైగా ఉండే హాస్టల్‌లో ప్రస్తుతం 58 మంది మాత్రమే ఉంటున్నారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడమే కారణమని తల్లిదండ్రులు అంటున్నారు.


పొలాల వెంబడి హాస్టల్‌కు వస్తున్న విద్యార్థులు, పనిచేయని ఫ్యాన్, మరుగుదొడ్డి దుస్థితి

పనిచేయని ఫ్యాన్లు

హాస్టల్ చుట్టూ పచ్చికబయళ్లు ఉండడంతో దోమలు అధికంగా ఉన్నాయి. ఫ్యాన్లు తిరగకపోవడంతో ఒక వైపు ఉక్కపోత, మరో వైపు దోమల స్వైరవిహారంతో విద్యార్థులు రాత్రి సమయంలో హాస్టల్‌లో ఉండాలంటే జంకుతున్నారు. కనీసం వసతి గృహాల్లో దుప్పట్లు, దోమతెరలు కూడా లేవు. కిటికీలకు మెస్ లేకపోవడంతో దోమలు అధికంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంపై పర్యవేక్షణాధికారులు పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. భోజనంకూడా నాణ్యత లేదని విద్యార్థులు అంటున్నారు. వార్డెన్‌కు మూడు హాస్టళ్ల ఇన్‌చార్జ్ ఇవ్వడంతో ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియడంలేదని తల్లిదండ్రులు అంటున్నారు.

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాటిని శుభ్రం చేసేవారు లేరు. రాత్రి సమయంలో మూత్రశాలలకు, బహిర్భూమికి వెళ్లాలంటే కనీసం మరుగుదొడ్లలో విద్యుత్ దీపాలు కూడా లేవు. దీంతో విద్యార్థులు హాస్టల్‌కు రావాలంటే జంకుతున్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభించిన సమయంలో 87 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 58 మంది మాత్రమే ఉంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీరిలో కూడా సాయంత్రం సమయంలో చాలామంది ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు లేవు

హాస్టల్‌లో విద్యార్థులకు ఫ్యాన్లు, దీపాలు, వివిధ సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కొరత ఉంది. విద్యార్థుల కోసం విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, భోజనశాల ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నిధులు ఇస్తే మరమ్మతులు చేస్తాం.

- జయరామిరెడ్డి, ఇన్‌చార్జ్ వార్డెన్

వైద్య సిబ్బందిపై పంచాయతీ కార్యదర్శి చిందులు

సచివాలయంలో సమావేశం ఏర్పాటుపై ఆగ్రహం

నల్లచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బందిపై పి.కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి లోహిత చిందులు వేశారు. స్వస్థినారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పి.కొత్తపల్లి సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి కల్పనారెడ్డి, సీడీపీఓ వెంకటలక్ష్మి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మహిళలకు అవగాహన కల్పిస్తున్న సమయంలో అక్కడికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి లోహిత.. 'ఈ కార్యక్రమాన్ని ఎవరిని అడిగి సచివాలయంలో నిర్వహించారు.. నా అనుమతి లేకుండా ఇక్కడ కూర్చోవడానికి వీలులేదు, ఇక్కడి నుంచి వెళ్లిపోండి..' అంటూ అధికారులపై మండిపడ్డారు. మహిళలకోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న కార్యక్రమని చూడకుండా కార్యదర్శి మండల అధికారులను సచివాలయం నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడంతో అధికారులు నివ్వెరపోయారు. ఆమెతో వాగ్వాదానికి వెళ్లలేక కార్యక్రమాన్ని అర్థాంతరంగా అక్కడి నుంచి స్థానిక ఆర్డీటీ పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి తీరుపై గ్రామస్థులు మండిపడ్డారు. మహిళలకు సంబంధించిన కార్యక్రమాన్ని మహిళ అయిన కార్యదర్శి ఇలా చేయడం సరికాదన్నారు. వైద్యాధికారిని ఈ విషయంపై వివరణ కోరగా.. కార్యదర్శి లోహిత గురువారం కార్యక్రమం నిర్వహించడానికి అంగీకరించిందని అన్నారు. కార్యదర్శి తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యదర్శి లోహితను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.


వైద్య సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న కార్యదర్శి లోహిత

సిబ్బంది కొరత తీరుస్తాం: డీఎస్పీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

నంబులపూలకుంట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరతను త్వరలోనే భర్తీ చేస్తామని డీఎస్పీ శివనారాయణస్వామి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి, సమస్యాత్మక గ్రామాల గురించి ఎస్ఐ వలీబాషాను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికల దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పోలీసుల నిఘా పెంచాలన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, పీఆర్‌సీని వెంటనే నియమించాలని అపాస్ జిల్లా అధ్యక్షుడు అమరా చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వివిధ పాఠశాలలో అపాస్ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోలాగానే పరీక్ష మూల్యాంకనం పద్ధతి మంచిది అన్నారు. పాత పీఆర్‌సీ గడువు దాటి 26 నెలయినా కొత్త పీఆర్‌సీని నియమించలేదన్నారు. కార్యక్రమంలో అపాస్ నాయకులు సురేశ్‌బాబు, హర్షవర్దన్, రమేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన రమేశ్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం ఓవర్‌హెడ్‌ట్యాంక్ ఎక్కికిందకు దూకి ఆత్మహత్యకు యత్నించాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...రమేశ్ అనే వ్యక్తి మతిస్థితిమితం సరిగా లేకపోవడంతో ఇంటి సమీపంలో ఉన్న ట్యాంక్ ఉన్న మెట్లు ఎక్కి అక్కడి నుంచి దూకాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీలర్లకు ఈపోస్ యంత్రాల పంపిణీ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటసాయి ఐటీఐ కళాశాలలో శుక్రవారం రేషన్ డీలర్లకు కొత్త ఈపోస్ యంత్రాలను తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, సీఎస్‌డీటీ విజయనిర్మల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్, పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు సున్నంపల్లి రమణ, కుళ్లాయప్ప మాట్లాడుతూ.. సున్నంపల్లి, అల్లాపల్లి పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 12నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. అనంతరం ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆంజనప్ప, రమణప్ప, రమేష్, రాము, నిర్మల, శ్రావణి, నాగమ్మ, సాలెమ్మ, భాగ్యమ్మ, ఓబులమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

నారీ శక్తి యాప్‌పై అవగాహన

తనకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న సరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నారీశక్తి యాప్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. ఆడపిల్లల భద్రత, ప్రాముఖ్యత వివరించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. నారీ శక్తి యాప్ ద్వారా ఎలా ఫిర్యాదు చేయవచ్చో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సనత్‌కుమార్, కరస్పాండెంట్ పీజీ నరేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి


ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లు వెంటనే విడుదల చే యాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫీజు రియింబర్సుమెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, గణేష్, శీను, మహేష్; బాబు బ్రహ్మయ్య తదిరులుపాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బ్యాంక్ కార్యాలయంలో పుట్టపర్తి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ముమ్మనేని వెంకటరాముడు అధ్యక్షతన ఎస్ఎల్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ...ఆర్థిక అక్షరాస్యత, పొదుపు ఆవశ్యకత, ప్రధానమంత్రి సురక్షబీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ మల్లికార్జున, పాల్గొన్నారు.

పీఎంఏవైతో రూ.2.5 లక్షల సాయం



పీఎంఏవై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం డీఈ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష కలిపి మొత్తం రూ.2.5 లక్షలు కేటాయిస్తాయని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలు పీఎం ఆవాస్ యోజనకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో అంగీకార్-2025 ప్రచార కార్యక్రమాన్ని కేంద్రం సెప్టెంబరు, అక్టోబరు నె లల్లో నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీఎల్‌టీసీ రమేష్‌నాయక్, మండల ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పురుషుల భాగస్వామ్యాన్ని పెంచండి

తనకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకంలో పురుషుల భాగస్వామ్యం పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. పిల్లల సంరక్షణ, పోషణ కార్యక్రమాల్లో పురుషులుకూడా భాగస్వాములు కావాలన్నారు. శుక్రవారం మండలంలోని గోళ్లవారిపల్లిలో పోషణమాసం సమావేశం నిర్వహించారు. స్థానికంగా దొరికే వివిధరకాల కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో చేసిన పంటల ప్రముఖ్యతను వివరించారు. పురుషులచే పిల్లల పెంపకంలో భాగస్వామ్యం వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీహెచ్ఇఓ వెంకటరమణ, శాంతి, మహేశ్వరీ, ఉమాదేవి, జుబేదా, దేశేనాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా..?

మండల సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధుల డుమ్మా

బత్తలపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పట్ల అధికారులు, ప్రజాప్రతినిధులకు చులకనభావం నెలకొంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరు కావాలని ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలకు అధికారులు నోటీసులు పంపారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలి. మండలంలో 11 మంది ఎంపీటీసీలు ఉండగా నలుగురు, 13 మంది సర్పంచులు ఉండగా ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ప్రజల సమస్యలు లేవనెత్తే ముఖ్యమైన సమావేశానికి డుమ్మా కొట్టారు. వీరికి ప్రజా సమస్యలు పట్టవా అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు ఆరోగ్యశాఖ, పౌరసరఫరాల శాఖ, ఇరిగేషన్, ఉద్యానవన, ఆర్అండ్‌బీ, సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, దేవదాయ, మత్స్య, ఆర్టీసీ, సిరికల్చర్, ఎక్సైజ్, సహకార శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హాజరైన ప్రజాప్రతినిధులు ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ త్రివేణి, ఎంపీడీఓ నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.


అరకొరగా హాజరైన సభ్యులు

దస్తావేజు లేఖరుల నిరసన


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఐజీఆర్ఎస్ సైట్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంఘం పట్టణ అధ్యక్షుడు జావీద్‌బాషా, ఉపాధ్యక్షుడు బారుబాస్కర్, నాయకులు మహేంద్ర, నాగార్జున, మల్లికార్జున మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 2.0 సాఫ్ట్‌వేర్‌లో గల సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ జాప్యమవుతోందని అన్నారు. దీంతో ప్రజలకు, దస్తావేజు లేఖరులకు సమయం వృథా అవుతోందని వివరించారు.

22న సేవా కార్యక్రమాలు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ఈనెల 22న పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు గాంధీనగర్ శివాలయంలో శ్రీరామ్ పేరిట పూజలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం గాంధీ సర్కిల్లోని టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తామని తెలిపారు. అన్నక్యాంటీన్లు, సిద్దయ్యగుట్టలో భోజన వసతి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ ఉంటాయని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, మహేశ్‌చౌదరి, సుధాకర్, ఫణికుమార్, రాఘవ, నాగూర్‌హుస్సేన్, పెద్దన్న, పురుషోత్తంగౌడ్, షరీఫ్, పురుషోత్తం, సనత్, చంద్రమోహన్, లక్ష్మన్న, రామాంజనేయులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు


కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న అంజినప్ప

పుట్టపర్తి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యాంప్రసాద్‌ను కలెక్టరేట్‌లో శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు తెలుదేశం పార్టీతో పాటు కూటమి పార్టీల పరంగా సహకారం ఉంటుందని తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, సంఘాల నేతలు కలెక్టర్‌ను కలిశారు.

● పుట్టపర్తిరూరల్: కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కాపునాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ బీసీ సంఘాల అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

కారు బోల్తా.. త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తా పడిన కారు

తనకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి వద్ద శుక్రవారం ఉదయం కారు బోల్తా పడింది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. తిరుపతికి చెందిన వ్యక్తి అనంతపురం నుంచి తిరుపతికి కారులో వెళ్తున్నారు. మార్గ మధ్యంలో చీకటిమానుపల్లి వద్ద ఎదురుగా లారీ రావడంతో రోడ్డు పక్కకు రావడంతో వేగాన్ని నియంత్రించలేక కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రమాదం నుంచి సురక్షితంగా బయపడ్డారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం వీఆర్‌ఏలు రెండో రోజు ధర్నా నిర్వహించారు. వీఆర్‌ఏలకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజా, లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, వెంకటేష్, బాబ్జాన్, పక్కీరప్ప, నౌషాద్, రఫీ, ముత్తు పాల్గొన్నారు.

● బుక్కపట్నం: వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు నరసింహులు, చలపతి, నాగరాజు, రాము, నాగభూషణ, సీపీఐ షెక్షావలి పాల్గొన్నారు.

'సోలార్ మాయలో పడొద్దు'

గాండ్లపెంట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సోలార్ మాయలో పడొద్దని రైతు సంఘం మండల నాయకుడు కేకే రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులను సోలార్ మాయలో పడేస్తోందని, ఎకరాకు సంవత్సరానికి రూ.30 వేల వంతున లీజుకు తీసుకుంటామని ఆశ చూపుతోందన్నారు. సోలార్‌కు భూములిచ్చిన రైతులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. రైతులు అవగాహన పెంచుకుని వారి భూములు పెట్టుబడి దారుల చేతుల్లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు నీరు

కదిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తలుపులలో ప్రధాన రోడ్లపై వివిధ హోటళ్లు, చికెన్ షాపులు, వాణిజ్య దుకాణాల్లోని మురుగునీరంతా వేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రోడ్డులో నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. కుమ్మరపేట నుంచి పోలీస్‌స్టేషన్ వరకు దుకాణాల నుంచి వచ్చే చెత్తచెదారం రోడ్డుపైనే వేస్తున్నారు. దుకాణాల్లో ఇనుప మేకులు, ఇతర సామగ్రి ఉండడంతో పాదచారులతో పాటు ద్విచక్రవాహనాలకు గుచ్చుకుంటున్నాయి. దుకాణాల నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థపదార్థాలతో పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. నడిరోడ్డుపై అలా ఇష్టారాజ్యంగా మురుగునీరు ప్రవహిస్తున్నా సంబంధిత పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులైనా చర్యలు తీసుకోవాలని తలుపుల వాసులు కోరుతున్నారు.


తలుపుల ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

న్యూస్ బాక్స్

కొనసాగిన వీఆర్ఏల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

పెనుకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన ధర్నా శుక్రవారం రెండోరోజూ కొనసాగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో వీఆర్ఏలు ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సీపీఐ శ్రీరాములు మాట్లాడుతూ 30ఏళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందిస్తున్న వీఆర్ఏలకు నేటికీ జీతాలు పెంచలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీఆర్ఏల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలను వీఆర్ఓలుగా కల్పించాలని, కనీస వేతనం రూ.22వేలు ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏలుగా నియమించాలన్నారు. మల్లికార్జున, నరసింహులు, వీఆర్ఏల సంఘం నాయకులు నరసప్ప, అంజినప్ప, లక్ష్మీకాంతమ్మ, సుశీలమ్మ, రాజేశ్వరి, రాధమ్మ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇష్టంతో చదవాలి: హెచ్‌ఎం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రొద్దం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కోగిర జడ్పీ పాఠశాల హెచ్‌ఎం హరికిరణ్ అన్నారు. పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. ప్రతిభాషను నేర్చుకుని విదేశాలు, పట్టణాల్లో మంచి ఉద్యోగాలు పొందవచ్చన్నారు. హిందీభాషపై విద్యార్థులు ఉపన్యాసాలు, బాలగేయాలతో సభికులను ఆకట్టుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషాను సన్మానించారు.

ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం



ఆలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న పరిగి వేణుగోపాల్

పరిగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆశయాల మేరకు ప్రతి గ్రామంలో స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. పారిశుధ్య కార్మికులు, బీజేపీ నాయకులు పిచ్చిమొక్కలు, వ్యర్థాలు తొలగించి చెట్లకు పాదులు తీశారు. మోదీ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎల్ కృష్ణమూర్తి, శ్రీనివాసులు, బద్రీ, శివ, మూర్తి, సురేంద్రపాండె పాల్గొన్నారు.

ఖాతాదారులకు విరివిగా రుణాలు: జీఎం



కెనరా బ్యాంక్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జీఎం

గుడిబండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంక్ ద్వారా మహిళా సంఘాలు, రైతులకు, ఖాతాదారులకు విరివిగా రుణాలు అందిస్తామని తిరుపతి సర్కిల్ జీఎం పాండురంగ, ఏజీఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం గుడిబండ కెనరాబ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. మేనేజర్ మల్లయ్య, అసిస్టెంట్ మేనేజర్ సాయినాథ్, మల్లికార్జున, ఖతాదారులు షబ్బీర్, దుర్గేష్, వెలుగు సిబ్బంది సతీష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

అమరాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు విద్యార్హత, సర్వీస్ ఆధారంగా ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు నరేష్‌బాబు, సుధాకర్, యోగానంద్, గౌరమ్మ, రాజేష్, వీరకరియన్న, సురేష్, ఈరన్న పాల్గొన్నారు.

అధికారులకు ఉత్సవ కమిటీ సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వినాయకుడి నిమజ్జన కార్యక్రమం విజయవంతం కావడంతో శుక్రవారం అధికారులను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, సీఐలు రాజగోపాల్‌నాయుడు, కరీం, జనార్దన్, ఆంజనేయులను సత్కరించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదర్శ్‌కుమార్, నిమ్మకాయల రాము, రమేష్‌రెడ్డి, పాండురంగారావు, టీకేబాబు, రమేష్ ఉన్నారు.

104 ద్వారా మెరుగైన వైద్యసేవలు

గుడిబండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు 104ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కేఎన్ పల్లి గ్రామంలో ప్రజలకు షుగర్, బీపీ, జ్వరం తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్ల పొదల మధ్య నీటి ట్యాంకు

- కలుషితమవుతున్న తాగునీరు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



గుబురు చెట్ల మధ్య ఉన్న నీటి ట్యాంక్

సోమందేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికుంటపల్లి గ్రామానికి తాగునీటిని అందించే నీటి ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొళాయిల ద్వారా తమకు అందే నీరు సురక్షితమేనా అని ప్రశ్నిస్తున్నారు. నీటి ట్యాంక్‌లో విషపురుగులు, చెట్ల వ్యర్థాలు పడి కలుషితం అవుతున్నట్లు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛతాహిసేవ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు గ్రామాల్లో అమలు కావడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఏమేరకు చర్యలు చేపడుతున్నారో వారిపనితీరుకు ఇది అద్దం పడుతోంది. పారిశుధ్య పనులు ప్రతి రెండో శనివారం ఏర్పాటు ఫొటోలకు ఫోజులివ్వడంతప్ప అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. అసలే వర్షాకాలం ఆపై సీజనల్ వ్యాధులు విజృంభించి గ్రామాల్లో ప్రజలు జ్వరాలబారినపడి ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. ట్యాంకులో ఉన్న నీరు కలుషితమై సరఫరా అయితే ఏంటి పరిస్థితని స్థానికులు ప్రశిస్తునానరు. అధికారులు వెంటనే స్పందించి కంపచెట్లు, ముళ్లకంపలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

దస్తావేజు లేఖరుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖరులు

మడకశిర టౌన్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాల వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని దస్తావేజు లేఖరులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం దస్తావేజులేఖరులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆధార్ ఓటీపీ, స్థానిక డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లలో పలుమార్లు సాంకేతిక సమస్యలు వస్తుండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో క్రయ విక్రయదారులు పలు మార్లు వారు కట్టిన చాలానా డబ్బులు సైతం కోల్పోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విధానంలో మార్పులు అవసరమని అన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తికి వినతి పత్రం అందించి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. లోకేష్, షమీవుల్లా, జిలాన్, రాజన్న, ఆలప్ప, నాగేంద్ర, సన్నప్ప, చంద్రప్ప, రమేష్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదివేవారికి మంత్రి అండ

- యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమతలేక ఉన్నత చదువులు చదివే నిరుపేద విద్యార్థులకు ఎల్లవేళలా మంత్రి సవిత అండగా ఉంటారని యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిరుపేద వైద్య విద్యార్థి సంతోష్ నాయక్‌కు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. తల్లి లలితాబాయి, తండ్రి రవీంద్రనాయక్ విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి మంచిస్థాయిలో నిలబడి చేసిన సహాయాన్ని మరువకుండా వైద్యవృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, ప్రసాద్, నారాయణస్వామి, నీరుగంటి చంద్ర, నాగార్జున, కుప్పేనాయక్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

రొళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయం జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు కలిసి కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రవి, ఉపాధ్యక్షుడిగా శశికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలాజీనాయక్, కార్యదర్శి ఆంజనేయులు, సహకార్యదర్శి కిరణ్‌కుమార్, మహిళా కార్యదర్శి అరుణ, కోశాధికారి మౌనికలను ఎన్నుకున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రొళ్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో శనివారం జరగబోయే స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరవుతున్నట్లు వైద్యాధికారిణి డా.సృజన తెలిపారు. మండలంలోని మహిళలకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

గాయపడిన మధ్యప్రదేశ్ వాసి మృతి

గోరంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు సమీపం గ్రీన్‌ఫీల్డు హైవే రహదారి మురుగునీటి కాలువ పనులు నిర్వహిస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన భునేశ్వర్ (45) గాయపడ్డాడు. చికిత్సకోసం అనంతపురం తరలిస్తుండగా గురువారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని సింగ్రవళి జిల్లా మెటవాయి గ్రామానికి చెందిన భునేశ్వర్‌తోపాటు ఆప్రాంతానికి చెందిన లాల్‌పటేల్, గోవిందు కాలువ పనులు నిర్వహిస్తూ, పులేరు వద్ద సైట్‌లోనే నివసిస్తున్నారు. 17వ తేదీన రాత్రి మద్యం మత్తులో మాట మాట పెరిగి భునేశ్వర్‌ను లాల్‌పటేల్, గోవిందులు కొట్టడమేకాకుండా కత్తితో కడుపుపై పొడవడంతో రక్తగాయమైంది. గురువారం గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి రాగా, చికిత్సలు చేసి, మెరుగైన వైద్యకోసం హిందూపురం, అక్కడినుంచి అనంతపురం తరలి వెళ్లాలని వైద్యులు సూచించారు. మార్గమధ్యలో భునేశ్వర్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

అగళి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి శుక్రవారం తన పొలంలో పనిచేస్తుండగా పాము కాటువేసింది. స్థానికులు గమనించి హుటాహుటిన రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

పరిగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని యర్రగుంట గ్రామంలోని దళిత కాలనీలో వట్టెమ్మ అనే మహిళ నివాసముంటోంది. అదేకాలనీకి చెందిన శ్రీరాములు అనే వ్యక్తి ఆమె ఇంటి మూత్రం పోసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు శుక్రవారం పరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సెక్షన్ 304 కింద కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నగేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని టీడీ పల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానం ఉన్న ఇళ్లను సోదా చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు.

రైతుల సంక్షేమమే టీడీపీ లక్ష్యం



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న నాగరాజు, నాయకులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుసంక్షేమమే లక్ష్యంగా టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కల్లుమర్రి గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా పింపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతుల అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, రైతులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక చింతనతో ఎక్కడైనా రాణించవచ్చు'

పావగడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మనిషిగా తన లోపాలను సరిదిద్దుకుని ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలరని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సోదరి ఆదిలక్ష్మి అన్నారు. పావగడ నుంచి అయోధ్య రామ మందిరంతోపాటు ప్రముఖ ధార్మిక కేంద్రాలైన సోమనాథ, ద్వారక, వారణాసి, అయోధ్య రామమందిరం వరకు పర్యటించామన్నారు. అలాగే ప్రముఖ ధార్మిక కేంద్రమైన మౌంట్ ఆఫ్ రాజస్థాన్ దర్శించుకుని పునీతులైనట్లు ఆమె తెలిపారు. ప్రజాపిత బ్రహ్మ గురువులు కూడా దర్శించుకుని ఆధ్యాత్మికంగా ఎంతో ధన్యమైనట్లు సేవాకర్త రాజశేఖర్ తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న మంగేష్

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీపురంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణమండపానికి టీడీపీ నాయకుడు మంగేష్ విరాళాన్ని అందజేశారు. రూ.1,11,000 విరాళంగా ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బాలాజీ దేవాలయ కల్యాణమండపం సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులకు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ కమలమ్మ

గుడిబండ, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కేఎన్‌పల్లి గ్రామంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ నరేష్ బాధ్యతల స్వీకరణ

గోరంట్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఎంపీడీఓ నరేష్ క్రిష్ణ గోరంట్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నరేంద్రకుమార్ ఉద్యోగోన్నతిపై నంద్యాల జిల్లా డోన్ డ్వామా ఏపీడీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నరేష్‌ను నియమించారు. ఆయనకు డిప్యూటీ ఎంపీడీఓ దేవదానం, కార్యాలయ సిబ్బంది నీరంజన్‌రెడ్డి, సతీష్‌కుమార్, హరి స్వాగతం పలికారు.

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ



రిబ్బన్ కట్‌చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, డాక్టర్లు

మడకశిర టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నాయని వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మడకశిర వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో స్వస్థ్ నారీసశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో మహిళలకు, కిశోర బాలికలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. గర్భిణులు, వృద్ధులకు వివిధ పరీక్షల నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, వైద్యులు శశిరేఖ, ప్రభాకర్‌నాయుడు, మోహన్, నీరజ పాల్గొన్నారు.

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన మహిళలు ఉంటేనే బలమైన కుటుంబాలు ఏర్పడతాయని డాక్టర్లు నరేష్ కుమార్, లిఖీత అన్నారు. శుక్రవారం మండలంలోని కదిరేపల్లి,కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గుర్రపుకొండ, సి.కోడిగేపల్లి గ్రామాల్లో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్ వైజర్ రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరేష్‌కుమార్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. టీడీపీ నాయకుడు మగ్బూల్ ఆధ్వర్యంలో ఎంజీఎం క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా అబ్దుల్‌కాలం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. శుక్రవారం ఫైనల్స్ కావడంతో సీపీఐ స్టార్స్, టీమ్‌స్పిరిట్ జట్లు తలపడ్డాయి. టీమ్‌స్పిరిట్ జట్టు పది ఓవర్లలో వికెట్ నష్టానికి 131పరుగులు తీసింది. సీపీఐ స్టార్ టీమ్ ఎనిమిది వికెట్ల నష్టానికి 82పరుగులు చేసింది. విజేతగా నిలిచిన టీమ్‌స్పిరిట్ జట్టుకు రూ.20వేలు, రన్నరప్ జట్టుకు రూ.12,500 మగ్బూల్ అందించారు. కార్యక్రమానికి హాజరైన అంజినప్ప, చైర్మన్ రమేష్ మాట్లాడుతూ తరచూ ఇలాంటి క్రీడలు నిర్వహించడంవల్ల యువతలో సమైక్యతభావం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్‌యాదవ్, నిర్వాహకులు మగ్బూల్‌బాషా, షాహిద్, తౌసిఫ్ పాల్గొన్నారు.

లోక్ కల్యాణ మేళాను వినియోగించుకోండి



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పీఎం స్వానిధి కింద లోక్ కల్యాణమేళా కార్యక్రమం నిర్వహిసున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు తెలిపారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ 17 నుంచి 25వ తేదీ వరకు లోక కల్యాణ మేళా 2.0 నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. దీని ద్వారా రూ,10 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకు ద్వారా చిరు వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. స్టేట్‌బ్యాంకు అధికారులు సైతం పాల్గొని పీఎం సురక్షయోజన, పీఎం జ్యోతి బీమా యోజన తదితర వాటిపై అవగాహన కల్పించారు. కమిషనర్ జగన్నాథ్, వైస్ చైర్‌పర్సన్ ప్రభావతి హనుమంతు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చేనెల 7న జరిగే కార్యక్రమానికి సంబంధించి వాల్మీకి కల్యాణమండపంలో ఆ సంఘం నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ వాల్మీకి జయంతికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వాల్మీకులు తరలి రావాలన్నారు. వాల్మీకి మహిళలు జ్యోతుల ఉత్సవం ఉంటుందన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, ఆకుల సూరీ, లోకేష్, భగీరథ నవీన, శేఖర్, టీకే బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అవార్డు కోసం పరిశీలన



కంపోస్టుయార్డ్‌ను పరిశీలిస్తున్న సర్వే బృందం సభ్యులు

హిందూపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీలకు అవార్డులు ప్రకటించేందుకు సర్వే బృందం పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా తూముకుంట పంచాయతీ పరిధిలో శుక్రవారం బృందం సభ్యులు పరిశీలించారు. థర్డ్ పార్టీ టీమ్ సభ్యులు కావ్య, ఆశలత పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీచేశారు. ఇళ్లవద్ద తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు ఏర్పాటు ట్రైసైకిల్, ట్రాక్టర్ ద్వారా ఇంటి నుంచి వందశాతం చెత్త సేకరణపై ఆరాతీశారు. వర్మీకంపోస్ట్, ఎరువుల విక్రయాలపై ఆరాతీశారు. డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, సర్పంచ్ రత్నమ్మ, చిన్నవీరప్ప, ఎంపీటీసీ షమీమ్‌తాజ్, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమరాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం దోమకాటు మనిషికి చేటు, మలేరియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, వారి ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారం ఉండదరాదని, నీటినిలువ చేయరాదని సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు, శ్రీలక్ష్మీనాయక్, వైద్యాధికారి అంబరీష్, మనోహర్‌నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సమీవుల్లా, హెల్త్ అసిస్టెంట్లు మనోహర్, శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జానకి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

12 గంటలైనా తెరుచుకోని సచివాలయం



ఉద్యోగుల రాక కోసం ఎదురుచూస్తున్న రైతు

రొళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీజీహళ్లి గ్రామ సచివాలయంలో ఉదయం 12 గంటలైనా సిబ్బంది హాజరుకాలేదు. 12గంటల తరువాత వెల్ఫేర్ అసిస్టెంట్ రమాదేవి వచ్చి కార్యాలయ తాళం తెరిచారు. తరువాత అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ వచ్చారు. మిగిలిన వారు ఎప్పుడు వస్తారో తెలియదు. దండన అనే రైతు తన పని కోసం ఉదయం 10గంటల నుంచి సిబ్బంది రాకకోసం ఎదుచూశారు. వారు రాకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. సిబ్బంది హాజరు కాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.